# ఆ అమ్మాయి

★ శ్రీనివాస ★

ఆ అమ్మాయి నాకెదురుగా కూర్చుంది. కూచో బోయే ముందు వాళ్ళమ్మవంక ఓసారి చూసి తనకెదురుగా వచ్చేబోయే జనాన్ని చూస్తూంది. కనుమూలసందుగుండా అప్పుడప్పుడు కనబడు తున్నా బాగానే కనబడుతోంది నాకు. నా వంక చూసింది. నేనూ చూశా. మళ్లీ కళ్ళు తిప్పుకుని వాళ్ళమ్మవంక చూసినా, ఓరకంటితో నన్నే చూస్తోంది. ఆ చూపునించి నేతప్పుకోలేక పోయినా. అలాగే ఆమెవంక చూస్తూకూచున్నా.

జనసమ్మర్దం ఎక్కువయింది. టీ. బీడీ సిగరెట్ అని దూరంగా కేకలు వినబడుతున్నాయి. ఇంతలో ఆ అమ్మాయి నాన్నో ఎవరో వచ్చి, ట్రెయినొచ్చింది లెమ్మన్నాడు. వాళ్ళ పెట్టెలు కూలీవాడు ముందు తీసుకెడుతున్నాడు. వాడి వెనకాలే ఆ అమ్మాయి మరచెంబు పట్టుకెడు తూంది. ముందుపోయే కూలీవాడివంకోసారి నా వంకోసారి చూసినవ్వింది. — నిజంగా నవ్వలేదు నాకలా కనుపించింది. ఆ అమ్మాయి వుద్దేశం కూలీవాడితో నన్ను పోలుద్ధామనయుంటుంది నా చేతిలో కూడా పెట్టెవుంది కాబట్టి. వాళ్ళమ్మకి యీగొడవలేమీ లేకుండా ఎక్కబోయే ట్రెయిను గురించి ఆలోచిస్తూంది— మళ్లీ ఆ అమ్మాయి నావంక చూసింది. వాళ్ళవెనకాల వస్తున్నానో లేదో అని. నిజంగానే వాళ్ళవెంట వెడుతున్నా:

ట్రెయినులోకి వాళ్ళకూలీవాడు ముంద కెక్కాడు. తరవాత ఆ అమ్మాయిఎక్కింది. ఎక్కబోతుంటే కాలుజారింది. 'అయ్యోపాపం!' అన్నా— మనస్సులోనే. నేనూ లోపలకెళ్ళి ఆ అమ్మాయి ఎదురుగుండా కూచున్నా. ట్రైను కదిలేకదుపులో పక్కకుపడుతూ నావంక చూసింది తన్నెక్కిరిస్తున్నానేమోనని. జేబులో చెయ్యిపెట్టా. నా జేబువంకోసారి నావంకోసారి చూసింది. జేబులోంచి బయటకొచ్చిన ఆవస్తువు ఆ అమ్మాయిని దిగ్భ్రాంతం చేసివుండచ్చు — నేనలా వూహించుకున్నా ఆమె ముఖాన్నిబట్టి. బయటికివచ్చిన ఆవస్తువు మామూలుదే. మీకు వింతగానే కనపడకపోవచ్చు. అదీ—సిగరెట్.

'ఈ అబ్బాయి సిగరెట్ కూడా కాలుస్తాడా!' అన్న ఓ చిన్నఆశ్చర్యార్థకం ఆమె ముఖంలో అక్షరాలాచూశాను. నా సిగరెట్ పొగ పోయే పైకి ఆమె ముంగురులు కూడా ఎగురుతున్నాయి. దీన్నిబట్టి యిద్దరిహృదయాలూ ఒకే పంథాన నడుస్తున్నాయని వూహించుకోవచ్చు.

పాపం ఆ అమ్మాయి సుకుమారి. ఎక్కువ గాలిని కూడా భరించలేదు. అందుకనే వచ్చేగాలికి ముక్కుని పైకెగపీల్చి కళ్ళుచిన్నవిచేసింది. ఆ అమ్మాయిని బాధిస్తున్న వెధవగాలిమీద నాకమిత మైనకోపంవచ్చింది. గాలిదేవుడికి బుద్ధిలేదు, కించి త్తయినావుంటే పాపం ఆ అమ్మాయినలా ఏడి పిస్తాడా!

కళ్ళుసగం మూసుకుంది. రెండురెప్పల మధ్యనుండీ ఆచీపురుపుల్లంత సందులోంచి ఆమె కంటిపాపలు నావంకేచూస్తున్నట్టు కనపడ్డాయి. జుట్టు సరిచేసుకునేందుకు చేయి పైకెత్తింది. గాజులు బాగున్నాయి. ఎర్రటిచేతిమీద నల్లటి గాజులెంతబాగుంటాయో వూహించుకోండి. అలా అమ్మాయి జుట్టు సవరించుకునేందుకు చెయ్యిపై కెత్తితే, ఆచేతిని సుకుమారంగా కిందికిదించి, ఆజుట్టును నేనే సవరించాలనిపించింది.

ఆ అమ్మాయి చాలాబాగుంది. అంటే 'ముద్దొ' స్తున్నది. చాలామంచిది — అని నావుద్దేశం మొదట్లో. కానీ నావంక అలాచూస్తూంటే మొదట్లోని నాభావాలు సరికాదనిపించింది. ఎందుకోగాని అప్పుడే నాభార్యజ్ఞాపకాని కొచ్చింది. కూడేళ్ళు నాతోబాటు గృహిణీధర్మం వహించిన నాభార్య యీ ఎదురుగుండా కూర్చు న్నఅమ్మాయిముందు ఎందుకూ కొరగాకుండా పోయిందంటే చాలాఆలోచించాల్సినవిషయమే. యీ అమ్మాయిలో గొప్పేముందని అడిగితే చెప్పలేను. ఆ చూపునించి ఎందుకు తప్పించుకో లేకపోయానో అంతకంటెచెప్పలేను. మొత్తం లెక్కపెడితే వాళ్ళమ్మవంకకంటె ఎక్కువ నా వంకే చూసివుంటుంది ఆ అమ్మాయి.

ఎందుకోగాని నాకోదుర్బుద్ధిపుట్టింది. ఆ అమ్మాయి జుట్టుముట్టుకో బుద్ధయింది. కానీ ప్రకృతి సహకరించలే. ట్రెయిను స్పీడుతగ్గ టంతో వాళ్ళనాన్నలేచాడు. పైనున్న పెట్టె దింపాడు. దాంతో నాహృదయంకూడా కిందికి దిగింది. ట్రెయినాగింది. కూలీవాడొచ్చాడు.

ముందరకూలీవాడు నడుస్తున్నాడు. వాడివెన కాలే అమ్మాయి మరచెంబు పట్టుకునడుస్తూంది. కిటికీలోంచి తొంగిచూస్తున్నా కానీ యీ సారి ఆ అమ్మాయినావంక తిరిగిచూడలే. టికెట్ కలెక్టర్ కు టికెట్ లిచ్చేదాకా కనపడింది. తరవాత అదృశ్యమైపోయింది.

ఇంతకీ అమ్మాయికి ఎనిమిదేళ్లుంటాయి.